

సమావేశంలో మాట్లాడుతున్న కారంపూడి కృష్ణమూర్తి సిద్ధాంతి

## బాలలపై లైంగిక దాడులను నిర్మూలిద్దాం

హనుమకొండ, జూన్ 1 : బాలలపై ఆన్‌లైన్‌లో జరుగుతున్న లైంగిక దాడులను నిర్మూలిద్దామని మత పెద్దలు పిలుపునిచ్చారు. శనివారం సుబేదారిలోని అసంత భవన్‌లో ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బత్తుల కరుణ అధ్యక్షతన వరంగల్, హనుమకొండ, మహబూబాద్ జిల్లాల పూజారులు, ముస్లిం కాజీలు, పాఠశాలల ఉపాధ్యాయులు, కమ్యూనిటీ నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పూజారుల వర్కింగ్ ప్రెసిడెంట్ కారంపూడి కృష్ణమూర్తి సిద్ధాంతి మాట్లాడుతూ.. బాలలు ఆన్‌లైన్‌లో అనేక రకాలుగా వేధింపులకు గురవుతున్నారని, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా జరగకుండా కృషి చేద్దామన్నారు. పరకాల ఇమామ్ కాజీ అజీజొద్దీన్, ఎర్ర శ్రీకాంత్, కాజీలు అబ్దుల్లా, అక్రం, ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్, ఆఫీస్ మేనేజర్ మైలవరపు అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీ సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్ విడుదల

హనుమకొండ చౌరస్తా, జూన్ 1 : కేయూ ఎమ్మెస్సీ 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (కెమిస్ట్రీ) ఆరో సెమిస్టర్ టైం టేబుల్‌ను పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్య విడుదల చేశారు. జూన్ 7, 10, 12, 14, 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయన్నారు. ఎనిమిదో సెమిస్టర్ జూన్ 11, 13, 15, 19న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతాయని, పదో సెమిస్టర్ 7, 10న జరుగుతాయన్నారు. ఎమ్మెస్సీ 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (బయోటెక్నాలజీ) 8వ సెమిస్టర్ 11, 13, 15, 19న, ఆరో సెమిస్టర్ 7, 10, 12, 18న, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ రెండో సంవత్సరం సెకండ్ సెమిస్టర్, ఎమ్మెస్సీ 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (కెమిస్ట్రీ) ఆరో సెమిస్టర్ పరీక్షలు 11, 13, 15, 18, 20, 22న జరుగుతాయని పేర్కొన్నారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! శ్రీమతి తహినీయత్ హర్మెయిన్, భర్త: ఖాజా అజారుద్దీన్, వయస్సు: 30 సం.లు, వృత్తి: ప్రభుత్వ ఉద్యోగి, ఇంటి నెం. 11-23-1594/B, ఎల్బీనగర్, వరంగల్ వాస్తవ్యులు జులైవాడ, హనుమకొండ నందు గల ఇంటి నెం. 1-9-829/1 అందాజ 166 చ.గజాలు గల ఇల్లు మరియు ఖాళీ స్థలం షేక్ అబ్దుల్ బాసిత్, S/o. మహ్మద్ అబ్దుల్ సమద్ గార్ల వద్ద కొనుగోలు చేసి ఉన్నారు. దివి: 11 మార్చి, 2024 రోజున రిజిస్ట్రేషన్ నెం. 5645/2024 కొనుగోలు దస్తావేజు ద్వారా సంపూర్ణ హక్కు భుక్తంలో కలిగి ఉండి యాజమాన్య మార్పిడి పొంది ఉన్నారు. 21 ఏప్రిల్ 2024 రోజున జులైవాడ నుండి కలెక్టరేట్ వైపు సొంత ద్విచక్ర వాహనంపై వెళ్ళుచుండగా పై స్థిరాస్తి లింక్ డాక్యుమెంట్లు Doc.No. 121/1987, Dt. 03-02-1987, ఒరిజినల్ డాక్యుమెంట్లు దారిలో పోగొట్టుకోవడం జరిగింది. ఇట్టి విషయమై 21-5-2024 సుబేదారి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేసి రసీదు పొందటమైనది. ఈ లింకు డాక్యుమెంటు ద్వారా ఎవరైనా మోసపూరిత దస్తావేజులు సృష్టించిన లేదా ఇంకా ఎవరైనా ఏదైనా లావాదేవీలు చేసిన చెళ్ళవనీయు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలపడమైనది.

ఇట్లు: శ్రీ గోగికార్ శివరాజ్,
న్యాయవాది ఎక్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్,
H.No. 16-2-216/A, 1st ఫ్లోర్, SBI కరీమాబాద్ బ్రాంచ్, వరంగల్. సెల్: 9908983667.

**PUBLIC NOTICE**

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to Godugu Kanakaiah, S/o. Godugu Ilaiah, Age: 48 years, Occ: Agriculture, R/o: Narayanagiri village Dharmasagar mandal Hanumakonda dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 (Seven days) from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Narayanagiri village Dharmasagar mandal a RCC roofed house bearing house number H.No. 8-2, to an extent of 294.93 Square yards its equivalent to an extent of 246.73 Square meters, in which RCC roofed house plinth area to an extent of 377.00 square feets within the boudaries bounded on:
East: House of belongs to Ettaboina Mogili
West: House of belongs to Gonela Narayana
North: House of belongs to Godugu Rajaiah
South: Road
Is situated Narayanagiri village Dharmasagar mandal Hanumakonda dist
Date: 30-05-2024
Sd/- G. LAXMANA MURTHY, Advocate
Huzurabad. Cell No. 94403 69866

## కేసుల పరిష్కారం

కాశీబుగ్గ, జూన్ 1: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మైనర్లు డ్రైవింగ్ చేసి పట్టుబడిన వాహనాల కేసులను ఈ నెల 3 నుంచి 8వ వరకు పరిష్కరించనున్నట్లు సీఐ కే శ్రీధర్ తెలిపారు. రెండో క్లాస్ కోర్టులో లోక్ అదాలత్ ద్వారా కేసులుంటే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. బాధితులు ఆధార్‌కార్డు, మైనర్లు బర్త్ సర్టిఫికెట్లు, ఎస్ఎస్‌సీ మెమో తీసుకురావాలని సూచించారు.

## కలెక్టర్ ఎంజీఎం సందర్శన

కాశీబుగ్గ, జూన్ 1: వరంగల్ ఎంజీఎం దవాఖానలో శనివారం వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఈసీజీ తీయించుకున్నారు. అలాగే, ఎక్స్‌రే విభాగం, హోమియోపతి, ఆయుర్వేద విభాగాలను పరిశీలించారు.

## తాటి వనం దగ్ధం

కమలాపూర్, జూన్ 1 : మండల కేంద్రంలోని ప్రమాదవశాత్తు తాటి, ఈత వనం దగ్ధమైనట్లు గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం తెలిపారు. తాళ్లపంపు, మంగళ పంపు ఏరియాలో నిప్పంటుకుని సుమారు మూడు వందల తాటి చెట్లు, వంద ఈత చెట్లు కాలిపోయినట్లు చెప్పారు.

# విత్తన షాపుల్లో విస్తృత తనిఖీలు

- నిబంధనలు పాటించకుంటే చర్యలు : వ్యవసాయ అధికారులు హెచ్చరిక

నర్సంపేట/నల్లబెల్లి/నెక్కొండ/ఐనవోలు/రాయపర్తి, జూన్ 1: నర్సంపేటలోని విత్తన షాపుల్లో పోలీసులు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ రమణమూర్తి, ఏవో మాట్లాడుతూ దుకాణాదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నల్లబెల్లి మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో రూరల్ సీఐ రాజగోపాల్‌గౌడ్, ఏవో పరమేశ్వర్, ఆర్ఐ రాజేంద్రప్రసాద్ తనిఖీలు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అందించాలని సూచించారు. ఖానాపురం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ఏవో శ్రీనివాస్, ఎస్సై రఘుపతి తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆర్ఐ సత్యనారాయణ, ఐలేశ్ పాల్గొన్నారు. నెక్కొండలోని విత్తన షాపుల్లో విత్తనాల నిల్వలు, ధ్రువీకరణ పత్రాలు, విత్తన ధరలను టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులైన ఏవో నాగరాజు, ఎస్సై మహేందర్, డీటీ రవి పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఐనవోలు మండల కేంద్రం, పంథిని, కక్కిరాలపల్లి, నందనంలోని విత్తనాల దుకాణాల్లో ఏవో అడుపు కవిత, ఎస్సై అనిల్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లు, బిల్ బుక్స్, కంపెనీల ఇన్‌వాయిస్‌ను పరిశీలించారు. రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏవో గుమ్మడి వీరభద్రం అధ్యక్షతన మండలంలోని సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వడ్డే సందీప్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు నకిలీ మందులు, విత్తనాలను అంటగడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


నర్సంపేటలో తనిఖీలు చేస్తున్న సీఐ


దామెర :ఊరుగొండలో తనిఖీ చేస్తున్న అధికారులు

### దామెరలో..

దామెర : మండలంలోని ఊరుగొండ, దామెర గ్రామాల్లో ఎరువులు, విత్తన విక్రయ దుకాణాల్లో తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, అగ్రికల్చర్ ఏడీఏ రవీందర్ శనివారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల అమ్మకాలపై షాపు ఎదుట బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, గడ్డం సదానందం, పోలీసులు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు..

గీసుగొండ : నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని ఎస్సై వెంకన్న హెచ్చరించారు. గీసుగొండ, మనుగొండ, ఎలుకుర్తి గ్రామాల్లో ఎరువుల, విత్తనాల, పురుగు మందుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే పీడియాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ రవీందర్‌రావు, ఏవో హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

## నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

### గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, జూన్ 1 : నిర్దేశిత ప్రమాణాల మేరకు అభివృద్ధి పనులు పూర్తి చేస్తేనే బిల్లుల చెల్లిస్తామని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం సురేంద్రనగర్ కాలనీ, ఏకశిల పార్క్, 100 ఫీట్ల రోడ్డు వడ్డేపల్లి ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనల మేరకు కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లిస్తామన్నారు. ఏఈ మాత్రమే పనుల రికార్డులు చేయాలన్నారు. ఇతర అధికారులు రికార్డులు చేసిన బిల్లులను పరిగణలోకి తీసుకోమని చెప్పారు. అనంతరం టౌన్ ప్లానింగ్ అనుమతులకు సంబంధించిన భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ రాజయ్య, డీఈ రవికుమార్, ఏఈ హరికుమార్, మేనక, టౌన్‌ప్లానింగ్ అధికారులు సుష్మ, బషీర్ పాల్గొన్నారు.

## మండల సభకు ముఖ్య అధికారులు డుమ్మా

నర్సంపేట రూరల్, జూన్ 1: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోతె కళావతి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. 28 శాఖలకు 13 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ముఖ్య శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఉదయం 10.30 గంటలకు జరగాల్సిన సభ మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. గంటలోపే సమావేశాన్ని ముగించారు. ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు, ఆర్ఐ రజాక్, ఎంపీవో సునీల్‌కుమార్‌రాజ్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు సంతోష్‌బాబు, కొండల్‌రెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో అమరులకు నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## అమరులకు కొవ్వొత్తులతో నివాళి

దామెర, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన అమరులకు దామెరలో బీఆర్ఎస్ శ్రేణులు శనివారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ముఖ్య కూడలి నుంచి కొవ్వొత్తులతో ర్యాలీగా అంబేద్కర్ జంక్షన్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గండు రామకృష్ణ, నాయకులు వేల్పుల ప్రసాద్, హింగె శ్రీనివాస్, గరిగె కృష్ణమూర్తి, సొనబొయిన కిశోర్, సొనబోయిన రాజు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

హనుమకొండ/వరంగల్, జూన్ 1 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్, బల్దియా ప్రధాన కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నారు. బల్దియా ప్రధాన కార్యాలయ భవనాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు మేయర్ గుండు సుధారాణి జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. అదాలత్ జంక్షన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్ సిక్తా పట్నాయక్ అమర వీరులకు నివాళులర్పిస్తారు. 9గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. కాగా, అధికారులు ఆవిర్భావ వేడుకలకు హాజరుకావాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాలు జారీ చేశారు.

## వివాహిత అదృశ్యం

గీసుగొండ, జూన్ 1 : వివాహిత అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో శనివారం జరిగింది. మేకల చిట్టి ఆమె భర్త శ్రీకాంత్ మధ్య నాలుగు రోజులుగా గొడవ జరుగుతున్నది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారి ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

## దశాబ్ది ఉత్సవాలకు భీమదేవరపల్లి ఉద్యమకారులు

భీమదేవరపల్లి, జూన్ 1 : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు మండల ఉద్యమకారులకు ఆహ్వానం లభించినట్లు జేఏసీ నాయకులు డ్యాగల సారయ్య, కాశిరెడ్డి ఆదిరెడ్డి తెలిపారు. 2009 నుంచి 2014 వరకు జరిగిన తెలంగాణ ఉద్యమంలో మండలంలోని ఉద్యమకారులు వివిధ దశల్లో గల్లీ నుంచి ఢిల్లీ వరకు నిరసనలు చేపట్టగా కేసులు నమోదైనట్లు వివరించారు. ఉత్సవాలకు భీమదేవరపల్లి ఉద్యమకారులను ప్రభుత్వం ఆహ్వానించడంపై హర్షం వ్యక్తం చేశారు.

## ‘ఆరోపణలను వెనక్కి తీసుకోవాలి’

నర్సంపేట రూరల్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంగౌడ్‌పై నిరాధారమైన ఆరోపణలు చేసిన యూట్యూబ్ చానల్ రిపోర్టర్ శివారెడ్డి వెనక్కి తీసుకోవాలని మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నర్సంపేట సర్వాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం సమగ్ర శిక్షణ పథకం కింద రూ. 2400 కోట్లు మంజూరు చేయకముందే వెంకటేశంగౌడ్ రూ. 150 కోట్లు స్వాహా చేశాడని శివారెడ్డి ఆరోపించడం సరికాదన్నారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## యువకుడిపై కేసు నమోదు

చెన్నారావుపేట, జూన్ 1: పెళ్లి చేసుకోవాలని యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. కల్‌నాయక్‌తండాకు చెందిన యువతికి సంగెం మండలానికి చెందిన గుగులోత్ నరేందర్ ఫోన్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే తనతో స్నేహంగా ఉన్నప్పుడు దిగిన ఫొటోలను అందరికీ పంపుతానని బెదిరిస్తున్నాడు. ఆ ఫొటోలను యువతి కుటుంబ సభ్యులకు పంపడంతో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

## పలు రైళ్లు రద్దు

కాజీపేట, జూన్ 1 : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల వల్ల కాజీపేట మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను ఆదివారం నుంచి రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్- గుంటూర్- సికింద్రాబాద్ మధ్య నడిచే గోల్కొండ, సికింద్రాబాద్- సిర్‌పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ మధ్య నడిచే భాగ్యనగర్, సికింద్రాబాద్-విజయవాడ-సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 2, 5, 6, 8, 9 తేదీల్లో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కాజీపేట, జూన్ 1 : లోక్ అదాలత్‌లో తక్కువ జరిమానాతో కేసులను ముగించేకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, వివిధ ట్రాఫిక్ కేసులలో సీజ్ అయిన ద్విచక్ర వాహన యాజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాజీపేట ట్రాఫిక్ సీఐ నాగబాబు కోరారు. ఈ నెల 3 నుంచి 8 వరకు హనుమకొండ సెకండ్ క్లాస్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్, వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసుల్లో ఆధార్ కార్డు, లైసెన్స్ దరఖాస్తు రసీదు, మైనర్లు బర్త్ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సీ మెమోతో లోక్ అదాలత్‌కు హాజరుకావాలన్నారు.

## విద్యార్థినులు సమాజాభివృద్ధికి పాటుపడాలి

హసన్‌పర్తి, జూన్ 1: విద్యార్థినులు ఉద్యోగాలు చేస్తూ సమాజాభివృద్ధికి పాటుపడాలని ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి సూచించారు. అనంతసాగర్‌లోని సుమతిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్-2024 కార్యక్రమాన్ని కాగ్నిజెంట్ టెక్నాలజీ హెచ్‌ఆర్, మేనేజర్ జితేందర్‌సింగ్‌తో కలిసి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు స్కిల్స్‌ను ఉపయోగించి కోడింగ్ సరళిలో మార్పులు తీసుకురావాలని కోరారు. ప్లేస్‌మెంట్‌కు సంబంధించిన లాజికల్, కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం నుంచే ప్రణాళిక, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, వివిధ కంపెనీల్లో విద్యార్థినులు 100 శాతం ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేశ్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వరదారెడ్డి, జితేందర్‌సింగ్

# ఘనంగా హనుమాన్ జయంతి


న్యాశాయంపేట : పూజలో పాల్గొన్న వినయ్‌భాస్కర్

కాశీబుగ్గ/వర్ధన్నపేట/గిర్మాజీపేట/నెక్కొండ, జూన్ 1: వరంగల్ జిల్లాలో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. వరంగల్ వరద దత్తక్షేత్రంలో వేలాది మంది భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దత్తక్షేత్రాన్ని సందర్శించారు. కాశీబుగ్గ మార్కెట్ రోడ్డులోని కోతి విగ్రహానికి పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్పొరేటర్ గుండేటి నరేందర్, మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్ పాల్గొన్నారు. కాశీబుగ్గలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో పంచామృతాలతో అభిషేకం చేశారు. వర్ధన్నపేటలోని బాలాంజనేయస్వామి ఆలయం, ఇల్లంద పంచముఖాంజనేయస్వామి, రామలింగేశ్వరాలయంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. పంచముఖాంజనేయస్వామి ఆలయంలో దాతలు అన్నదానం చేశారు. వరంగల్ బట్టలబజార్‌లోని వేంకటేశ్వరాలయం, రామన్నపేటలోని రామలింగేశ్వరాలయం, స్టేషన్‌రోడ్‌లోని కాశీవిశ్వేశ్వరాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వరాలయంలో ఈవో రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమంతుడికి సుగంధద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆకారపు వారి గుడిలో ప్రధానార్చకుడు లంకా శివకుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. నెక్కొండలోని రామాలయం, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

### న్యాశాయంపేటలో..

న్యాశాయంపేట : హనుమాన్ జయంతి సందర్భంగా భక్తాంజనేయ దేవస్థానంలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు మాడిశెట్టి శివశంకర్, వేల్పుల మోహన్‌రావు, వెనుకంటి సారంగపాణి జానకీరాములు, పులి రజనీకాంత్ తదితరులు హాజరయ్యారు.

న్యూస్ నెట్‌వర్క్ : గీసుగొండ మండలంలోని కోనాయిమాకుల పంచముఖ ఆంజనేయస్వామి, ఆత్మకూరులోని వేణుగోపాలస్వామి, హనుమకొండ పద్మాక్షికాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాల్లో, కాపువాడలోని ఆంజనేయుడి విగ్రహానికి, కాజీపేట పట్టణం 62వ డివిజన్ సోమిడి భక్తాంజనేయ, రాధాకృష్ణస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

## కొవ్వొత్తుల ర్యాలీలో జిల్లా గులాబీ నేతలు

హనుమకొండ, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులతో నిర్వహించిన ర్యాలీలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుకడు దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. అమరవీరులకు నివాళులర్పించారు. మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకన్న, మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ, బొంగు అశోక్, ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, వరంగల్ పశ్చిమ నియోజక వర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, బైరపాక ప్రశాంత్, బండి రజనీకుమార్, బొద్దె వెంకన్న, మైనార్టీ కమిషన్ మెంబర్ దర్శన్‌సింగ్, భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడు మోసగించాడని..

- యువతి ఆత్మహత్యాయత్నం
- బాధితురాలు ఏడు నెలల గర్భిణి

రాయపర్తి, జూన్ 1: ప్రేమ పేరుతో గర్భవతిని చేసిన యువకుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని మనస్తాపంతో యువతి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. యువతి తండ్రి గాదె రాంబాబు కథనం ప్రకారం.. పెర్కవేడుకు చెందిన రాంబాబు మండలకేంద్రంలో కొన్నేండ్లుగా నివాసముంటూ తాపీమేస్త్రీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమార్తె నర్మద, మండల కేంద్రానికి చెందిన జక్కుల నరేశ్‌యాదవ్ కొన్నేండ్లుగా ప్రేమించుకుంటున్నారు. ప్రస్తుతం నర్మద ఏడు నెలల గర్భిణి. నరేశ్ పెళ్లికి నిరాకరిస్తుండడంతో మనస్తాపం చెందిన ఆమె శనివారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో క్రిమిసంహారక మందు తాగింది. వెంటనే నర్మదను ఎంజీఎం దవాఖానకు తరలించారు.

## 28న డాక్ అదాలత్

హనుమకొండ, జూన్ 1 : ఈ నెల 28న పోస్ట్‌మాస్టర్ జనరల్ తెలంగాణ సర్కిల్ హైదరాబాద్‌లో 46వ డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ డివిజన్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల ప్రజలు పోస్టల్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులను ఈ నెల 14వ తేదీలోగా పోస్టల్ కవర్‌లో కే శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్ట్ మాస్టర్ జనరల్, హైదరాబాద్-500001 పంపించాలన్నారు. పోస్టల్ కవర్‌పై తప్పకుండా 46వ డాక్ అదాలత్ అని రాయాలని ప్రకటనలో పేర్కొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో స్పోర్ట్స్ మీట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

## ప్రెస్ క్లబ్‌కు అండగా ఉంటా...

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- స్పోర్ట్స్ మీట్ పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, జూన్ 1 : గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌కు అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. స్పోర్ట్స్ మీట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిత్యం ఉరుకులు, పరుగులతో వార్తల సేకరణలో బిజీగా ఉండే జర్నలిస్టులకు క్రీడలు ఒక ఆటవిడుపు అని అన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, జర్నలిస్టు సంఘాల నేతలు బీఆర్ లెనిన్, తోట సుధాకర్, గడ్డం కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ తొలగించాలి

కాజీపేట, జూన్ 1 : విష్ణుపురిలో ఇండ్ల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను తొలగించాలని శనివారం స్థానికులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి టవర్ పనులను ఆపాలని ఆదేశించారు.

## కబడ్డీ క్రీడాకారులు ప్రతిభ చాటాలి

నర్సంపేట, జూన్ 1: వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెళకువలతో కబడ్డీ క్రీడాకారులు ప్రతిభ చాటాలని కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. యువజన, క్రీడల జిల్లా అధికారి సత్యవాణి ఆదేశాలతో నర్సంపేటలో నెల రోజులుగా నిర్వహించిన కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు నిబంధనల ప్రకారం ఆడాలన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

ఖానాపురం, జూన్ 1: నాజీతండా, బోటిమీదితండాలో శనివారం ఎస్సై రఘుపతి, ఎక్సైజ్ ఏసీ నాగేందర్‌రావు ఆధ్వర్యంలో నర్సంపేట ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 35 లీటర్ల గుడుంబా, 2 వేల లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. 100 కిలోల బెల్లం, 5 కిలోల పటికను స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వార్డు అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

### బల్దియా అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్

వరంగల్, జూన్ 1 : వార్డు అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని బల్దియా అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్ అన్నారు. శనివారం కార్పొరేషన్ కౌన్సిల్‌లో వార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేటర్ల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పించన్ల మంజూరు ధ్రువీకరణ, పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, ఐటీ మేనేజర్ రమేశ్, ఆర్వోలు సుదర్శన్, యూసుఫొద్దీన్, షహజాదీ బేగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### జిమ్‌ను వినియోగించుకోవాలి

బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిమ్‌ను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కమిషనర్ కోరారు. శనివారం కార్పొరేషన్ ఆవరణలోని ఇండోర్ స్టేడియంలోని జిమ్‌ను పరిశీలించారు. స్టేడియం బాధ్యులను జిమ్ పరికరాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రూ. 50 వేలు వెచ్చించి జిమ్ పరికరాలకు మరమ్మతులు చేశామని తెలిపారు. డీఎఫ్‌వో శంకరలింగం, ఎస్ఎఫ్‌వో దయానంద్, కోచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## నిట్‌లో ఫ్యాకల్టీ ఓరియంటేషన్ ప్రోగ్రాం

హనుమకొండ చౌరస్తా, జూన్ 1 : నిట్ సెమినార్ హాల్‌లో ఫ్యాకల్టీ ఓరియంటేషన్ ప్రోగ్రాం ప్రారంభమైంది. 2022, 2023లో చేరిన ఫ్యాకల్టీ సభ్యుల కోసం రూపొందించినట్లు, ప్రారంభోత్సవానికి ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్, నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, నిట్ ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ వేణువినోద్ నాయకత్వం వహించారు. కార్యక్రమంలో ఐఐటీ గోవా డైరెక్టర్ ప్రొఫెసర్ ధీరేంద్ర, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ఐఐటీ ఇండోర్ రిజిస్ట్రార్ సిబా ప్రసాద్, ఎన్ఐటీటీటీఆర్ చండీగఢ్ ప్రొఫెసర్ మైత్రీదత్తా ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు.

## బియ్యం అందజేత

శాయంపేట, జూన్ 1 : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన జన్ను భద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతుల ఆదేశాలతో ఎంపీటీసీ మేకల శ్రీనివాస్ క్వింటాల్ సన్న బియ్యాన్ని ఆ కుటుంబానికి శనివారం అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ అట్ల తిరుపతి, నాయకులు మేకల వెంకన్న, అట్ల రమేశ్, కర్రు రవీందర్, పసునూటి రాజయ్య, మామిడి శంకర్, కొమ్మరాజు ప్రశాంత్, పోతుల విష్ణు, బండారి ఆనందం ఉన్నారు.


బియ్యం అందజేస్తున్న ఎంపీటీసీ, బీఆర్ఎస్ నేతలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

**WANTED FEMALE TELECALLERS**
★Urgent Requirement for ICICI, HDFC Bank Personal Loans Fresher Female Tele-Callers, Vacancies: 40, Sal+Inc. etc.., Job Location: HNK, Cont: 8886188690.
NTW-5697

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**HEALTH CARE**
★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం||ల సేవలు అందించబడును. సంప్ర|| 6281476205, 9440325526
KMM_11654

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565